క్లుప్తంగా

కొనసాగుతున్న ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



నీటి నాణ్యతను పరిశీలిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

టెక్కలి రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్వర్యంలో ధర్మనీలాపురం గ్రామంలో ఎస్ఎస్ఎస్ యూనిట్–3 సేవా శిబిరం కొనసాగుతోంది. ఇందులో భాగంగా మూడో రోజైన బుధవారం విద్యార్థులకు కెరియర్ గైడన్స్‌పై ఆదిత్య కళాశాల ప్రొఫెసర్ సంతోష్‌కుమార్ అవగాహన కల్పించారు. సాయంత్రం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి విద్య, ఉద్యోగ సాధికారితపై ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామంలోని నీటి వనరులను పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ,ఎన్ఎస్ఎస్ పీవో డి.వాసుబాబు ఉన్నారు.

ఇంగ్లిషు పరీక్షకు 48 మంది గైర్హాజరు

కాశీబుగ్గ: పలాస మండలం, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలోని ఎనిమిది కేంద్రాల్లో బుధవారం పదో తరగతి ఇంగ్లిషు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు 1607 మంది హాజరు కావాల్సి ఉండగా 48 మంది గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ట



పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం

ఇచ్ఛాపురం: పట్టణంలోని డబ్బూరి వీధి కాళీ మాత గుడి, పాతబజారు కూడలి వద్ద పంచ ముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం జరిగింది. వేదపండితుడు తేజేశ్వర శర్మ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. విగ్రహదాత లక్ష్మణరావు, నాగమణి దంపతులను కమిటీ సభ్యులు సత్కరించారు.

ఘనంగా శ్రీకృష్ణ ఆలయ ప్రతిష్ట



పూజలు చేస్తున్న పిరియా విజయ

కంచిలి: పోలేరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ విగ్రహం, ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు రెండు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం జరిగిన పూజా కార్యక్రమాల్లో ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిరియా విజయ పాల్గొన్నారు. ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, నేతలు లడ్డు కేశవపాత్రో, కొణపల సురేష్, బల్ల తిరుపతి ఉన్నారు.


పూజారివీధిలో వైద్య సేవలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు మేఘన, సుశీల

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధి 11వ వార్డు కాశీబుగ్గ, పూజారివీధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య సేవలను బుధవారం అందించారు. వార్డు కౌన్సిలర్, మున్సిపాలిటీ ప్రభుత్వ విప్ దుర్గాశంకర్ పండా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలు వీధులకు చెందిన వారు వచ్చి వైద్య పరీక్షలను చేయించుకున్నారు. పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ అగ్గున మేఘన, ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ అన్నెపు సుశీల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు.

పిచ్చుకలను సంరక్షించండి



పిచ్చుక బొమ్మలు చూపుతున్న విద్యార్థులు

నందిగాం: పిచ్చుకలతోపాటు ఇతర పక్షులను కాపాడాలని పెద్ద తామరాలపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గున్నయ్య పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో సేవ్ స్పారో కార్యక్రమం నిర్వహించారు. పక్షులు చేస్తున్న మేలు, వాతావరణ సమతుల్యతలో పిచ్చుకల పాత్రను విద్యార్థులకు వివరించారు. అంతకుముందు విద్యార్థులతో పిచ్చుకల డ్రాయింగ్ వేయించారు. ఉపాధ్యాయుడు శంకరరావు పాల్గొన్నారు.

మోదం.. ఖేదం!



వజ్రపుకొత్తూరు రూరల్: సీతాపురం వద్ద పంట పొలంలో చేరిన వర్షం నీరు



కాశీబుగ్గ: పాతజాతీయ రహదారిలో పారుతున్న వరదనీరు

- పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం
- చల్లబడిన వాతావరణం

కంచిలి: ఇచ్ఛాపురం, టెక్కలి, పలాస నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. అకాల వర్షం కొన్ని పంటలకు మేలు చేకూర్చగా.. కొందరికి నష్టాన్ని మిగిల్చింది. కంచిలి మండలంలో బుధవారం ఉదయం కురిసిన కుండపోత వర్షంతో రోడ్లపై నీరు నిలిచిపోయింది. ముఖ్యంగా మండల కేంద్రం కంచిలి మెయిన్‌రోడ్డులో కొన్ని చోట్ల డ్రైనేజీల నిర్వహణ సరిగా లేకపోవడం, కొన్నిచోట్ల పూర్తిగా డ్రైనేజీ లేకపోవడంతో వర్షం కురవగానే అందులో ఉన్న చెత్తంతా రోడ్డుమీదకు వచ్చేస్తుంది. వర్షం కురిసి ఒక్కసారిగా నీరు ప్రవహించడంతో డ్రైనేజీల్లోను, రోడ్ల పక్కన కుప్పలుగా పడేసిన చెత్తంతా రోడ్డుమీదకు వచ్చేసింది. దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. అధికారులు స్పందించి ముున్ముందు ఇలాంటి సమస్య లేకుండా చూడాలని స్థానికులు కోరారు.

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు మండలంలో కూడా వర్షం కురిసింది. పంట పొలాల్లో నీరు చేరింది. ఈ వర్షం నువ్వు, రాగులు, మిరప పంటలకు మేలు చేస్తోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో పాటు ఉరుములు, మెరుపులు రావడంతో ప్రజలు భయందోళనకు గురైయ్యారు.

ఇచ్ఛాపురం రూరల్: అకాల వర్షం ఇటుకబట్టీల పాలిట శాపంగా మారింది. మండలంలో సుమారు పాతిక వరకు ఇటుక బట్టీలు ఉన్నాయి. బుధవారం ఉదయం ఆకస్మికంగా కురిన అకాల వర్షానికి ఎండకు ఆరబెట్టిన పచ్చి ఇటుకలు వర్షార్పణం అయ్యాయి. ఒక్కో ఇటుకబట్టీలో సుమారు రూ. 50 వేల వరకు నష్టం వాటిల్లిందని యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు.



ఇచ్ఛాపురం రూరల్: మశాఖపురం వద్ద వర్షానికి తడిసిన ఇటుకలు



కంచిలి: రోడ్డుపైకి చేరిన చెత్త

టెక్కలి: వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో కురిసిన వర్షంతో టెక్కలిలో వాతావరణం చల్లబడింది. మేఘాలు దట్టంగా కమ్ముకున్నాయి. గత కొన్ని రోజులుగా వర్షాలు లేకపోవడంతో ఎండతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కురిసిన వర్షంతో పట్టణ వాసులు కాస్త చల్లబడ్డారు. రాత్రి వరకు వాతావరణం పూర్తిగా చల్లదనంగా మారింది.

కాశీబుగ్గ: పలాస మండలంలో భారీ వర్షం కురిసింది. మండలం, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో బుధవారం రోజంతా.. విడతల వారీగా వర్షం పడింది. మున్సిపాలిటీలోని లోతట్టు ప్రాంతాలు వరదనీటితో కనిపించాయి. కాశీబుగ్గలో పాతజాతీయ రహదారిపై వరదనీరు ఎరులాపారింది. లేబరు కాలనీ, ఆర్టీసీ కాంప్లెక్సు, పలాసలో వరదనీటితో ప్రజలు కొద్దిగా ఇబ్బందులు పడ్డారు. నూతనంగా వేసిన కేటి రోడ్డుపై ఎక్కడిక్కడ నీరు నిలిచిపోయి ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి.



టెక్కలిలో కమ్ముకున్న మబ్బులు

వేతనం పెరిగేలా పనుల కల్పన

- డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు

టెక్కలి: ఉపాధి హామీ పథకం ద్వారా పనుల్లో పాల్గొనే వేతనదారులకు సరాసరి వేతనం పెరిగే విధంగా వారికి పనులు కల్పించాలని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు సిబ్బందికి సూచించారు. కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్‌లతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి వంద రోజులు పని కల్పించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అలాగే 2024–25 సంవత్సరానికి సంబంధించి పనులు గుర్తించి వేతనదారులకు పని కల్పించాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ నేపథ్యంలో కోడ్ ఉల్లంఘన లేకుండా చూడాలని సూచించారు ఏపీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

కంచిలి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చేపడుతున్న చర్యలపై జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ బుధవారం సమీక్షించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన తహసీల్దార్ ఎం.వి.కె.ప్రసాద్, ఎంపీడీవో నీరజ, ఎస్సై జి.రాజేష్‌లతో సమీక్షించారు. ఎన్నికల విధుల్లో వలంటీర్లు పాల్గొనరాదన్నారు. ఎవరైనా పాల్గొంటే ఎన్నికల నియమావళికి విరుద్ధమని పేర్కొన్నారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.

క్షేత్రస్థాయిలో పర్యటించాలి

- ఆర్‌వో సుదర్శన్‌దొర



మాట్లాడుతున్న ఆర్‌వో సుదర్శన్‌దొర

ఇచ్ఛాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ స్థాయిలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి సుదర్శన్ దొర అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న అధికారులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఐదు మందిని ఎంసీసీ బృందాలుగా, తొమ్మిది మంది ఫ్లయింగ్ స్క్వేడ్ బృందాలుగా నియోజకవర్గంలో ఏర్పాటు చేయడం జరిగిందని, వారికి కేటాయించిన ప్రాంతాల్లో పర్యటిస్తూ ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు పరిచేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. సరిహద్దుల్లో అక్రమ మద్యం క్రయవిక్రయాలను నిరోధించాలని ఎస్ఈబీ అధికారులను సూచించారు. తహసీల్దార్ ఎం.భాస్కర అప్పారావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.దుర్గాప్రసాద్‌రెడ్డి, ఎన్నికల ఉప తహసీల్దార్ బి.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

అల్లుకోలలో పోషణ పక్వాడ

కాశీబుగ్గ: పలాస మండలం అల్లుకోల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గర్భిణులు, బాలింతలు, టీహెచ్‌ఆర్ పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలని అధికారులు సూచించారు.అనంతరం చిన్నారుల ఆటవస్తువులను ప్రదర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్త కోట ఢిల్లీశ్వరి, ఆశకార్యకర్త దువ్వాడ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పని చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్

ఇచ్ఛాపురం: అందరం కలిసికట్టుగా పనిచేసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకుందామని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అన్నారు. పురుషోత్తపురం, అమీన్‌సాహెబ్‌పేటలో బుదవారం బూత్‌కమిటీలు, బూత్ కన్వీనర్లు, కోకన్వీనర్లు, గృహసారథులు, నాయకులతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ అభ్యర్థి పిరియా విజయ, శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి పేరాడ తిలక్‌లను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించేందుకు అందరూ కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రరమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, కౌన్సిలర్లు సుగ్గు ప్రేమ్‌కుమార్, ఆదిరెడ్డి, జేసీఎస్ అధ్యక్షులు సాలిన ఢిల్లీ, ముఖ్య నేతలు పిలక సంతు, చాట్ల తిరుపతి, కాళ్ల సత్యం, దక్కత లోకనాథం, తేజేశ్వరరావు పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్



ఫ్లాగ్‌మార్చ్‌లో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తదితరులు

ఇచ్ఛాపురం: ఆంధ్ర–ఒడిశా సరిహద్దు చెక్‌పోస్టుల నుంచి ఎంటువంటి అక్రమరవాణా జరగకుండా ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పోలీసు సిబ్బందికి సూచించారు. మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల ఎన్నికల నేపథ్యంలో పురుషోత్తపురం వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టుని బుధవారం తనిఖీ చేశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున 24 గంటలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అక్రమ నగదు, మద్యం, గంజాయితో పాటు నిషేధిత పదార్థాలు అక్రమ రవాణా జరగకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని దాసన్న పేట కూడలి నుంచి బస్టాండ్ కూడలి వరకు మెయిన్ రోడ్ గుండా కేంద్ర బలగాలు నిర్వహించిన ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్నారు. డీఎస్పీ జి.నాగేశ్వరరెడ్డి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.సుదర్శన్‌దొర, సీఐ టి.ఇమ్మాన్యుయేల్ రాజు, పట్టణ ఎస్సై వి.సత్యన్నారాయణ, మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్ పాల్గొన్నారు.

‘ఫ్యాన్’ ప్రభంజనం సృష్టించాలి

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు



మందస: ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు



ఇచ్ఛాపురం రూరల్: బొడ్డబడ ప్రచారంలో నాయకులు



ఇచ్ఛాపురం: ప్రచారం చేస్తున్న నాయకులు

ఇచ్ఛాపురం: మే 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ‘ఫ్యాన్’ ప్రభంజనం సృష్టించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పలు గ్రామాల్లో నాయకులు పర్యటించారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ ఎనిమిదో వార్డులో పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పేద, మధ్య తరగతి ప్రజలకు జరిగిన లబ్ధిని వివరించారు. ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిరియా విజయ, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి పేరాడ తిలక్‌లను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. వార్డు కౌన్సిలర్ పి.మధుమూర్తి, పార్టీ నాయకులు ఉన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేయడమే మనందరి లక్ష్యమని మండల పార్టీ కన్వీనర్ పాతిర్ల రాజశేఖరరెడ్డి అన్నారు. కొళిగాం, కీర్తిపురం, పాయితారి, బొడ్డబడ గ్రామ పంచాయతీల్లో నాయకులు పర్యటించి ఎన్నికల ప్రచారం చేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులను నేరుగా కలుసుకొని పార్టీకి మద్దతు పలకాలని, గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని కోరారు. మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు రాంపత్ని చిట్టిబాబు, శ్రీనివాసరెడ్డి, గానాల చిరంజీవి, లిట్టుపాడి, ఉదయ్ బెహరా, ప్రియా నాయక్, కాళ్ల దేవరాజులు పాల్గొన్నారు.

మందస: అభివృద్ధి, సంక్షేమాన్ని అందించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని ఎంపీపీ డొక్కరి దానయ్య, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, జేసీఎస్ నియోజకవర్గం కన్వీనర్ చింతాడ గణపతి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పితాతొళి, భైరిసారంగపురం సర్పంచ్‌లు చింతాడ సుధ, రట్టి సరస్వతి అధ్యక్షతన డబారు, పితాతొళి, పితాతొళికాలని, భైరిసారంగపురం, రాధాకృష్ణపురం, మూడు రోడ్ల జంక్షన్ గ్రామాల్లో పర్యటించి, ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధిని, ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. మాజీ సర్పంచ్ బాడ జగన్నాయకులు, జేసీఎస్ మండల కన్వీనర్ దుంపల వైకుంతరావు, పార్టీ నాయకులు మట్ట షణ్ముఖరావు, బేపల తిరుపతి(చిన్న), గజ్జి దేశయ్య, గుసిరి తాతయ్య, వల్లభ చంద్రశేఖరం, అశోక్, గుంపు జగదీశ్, అన్నెపు సతీష్, సాప రామారావు ఉన్నారు.

రేపటి నుంచి డోలోత్సవాలు

హిరమండలం: సుభలయ గ్రామ సమీపంలోని తపోగిరిపై ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో డోలోత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. శుక్రవారం అర్ధ రాత్రి కామదహనంతో ఉత్సవాలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. శనివారం ఉదయం మూలవిరాట్ విగ్రహం నిజరూప దర్శనం, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. ఆదివారం ఉదయం స్వామివారి కల్యాణం, సాయంత్రం స్వామివారి తిరివీధి మహోత్సవం, సోమవారం స్వామివారి చక్రతీర్థ స్నానాలు, డోలాయనం, పంచాంగ శ్రవణంతోపాటు అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అధిక మెజార్టీతో గెలిపిద్దాం



పలాస: ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పలాస: పలాస నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును గతం కంటే అత్యధిక మెజారిటీ ఓట్లతో గెలిపించాలని.. అందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పార్టీ నాయకుడు మచ్చ ధనరాజు అన్నారు. పలాస మండలం కొబ్బరి చెట్లూరు గ్రామంలో బుధవారం బొడ్డపాడు, మాకన్నపల్లి, నీలావతి, గురుదాసుపురం, రంగోయి పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ముఖ్య నాయకులు, క్రియా శీలక కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం కరపత్రాలను, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆ తర్వాత గ్రామంలో ఇంటింటికీవెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో సర్పంచులు తామాడ మదన్, సైని దేశయ్య, సాౖర తిరుపతిరావు, మద్దిల పాపారావు, దేవరకొండ షణ్ముఖరావు, లక్ష్మీసూర్య పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



టెక్కలి: అవగాహన కల్పిస్తున్న మహిళలు



కంచిలి: ర్యాలీ చేస్తున్న దృశ్యం

టెక్కలి: అర్హత కలిగిన ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏపీఎం నారాయణరావు ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు ర్యాలీ నిర్వహించి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పద్మ, వరదరాజు పాల్గొన్నారు.

‘నీ ఓటు–నీ భవిష్యత్’పై అవగాహన

కంచిలి: ఓటు హక్కును సద్వినియోగపర్చుకోవాలని వైఎస్సార్ కేపీ ఏపీఎం పి.ఉమారాణి అన్నారు. బూరగాం గ్రామంలో ‘నీ ఓటు– నీ భవిష్యత్తు’పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇందులో ఓటు హక్కు– మీ జన్మ హక్కు, ఓటు వేయండి–ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, ప్రలోభాలకు లొంగకండి– నిర్భయంగా ఓటు వేయండి, మీ సమస్యలకు పరిష్కారం– మీ ఓటు సమాధానం, ఐదు సంవత్సరాలకు వచ్చే ఎన్నికలను ప్రతి వ్యక్తి ఒక్క గంట సమయాన్ని వెచ్చించి తమ ఓటు హక్కు వినియోగించుకుందామని నినాదాలు చేశారు. అవగాహన ర్యాలీలో సీసీలు, వీవోఏలు, స్వయం శక్తి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఓటు మనందరి హక్కు

ఇచ్ఛాపురం రూరల్: ఓటు మనందరి ప్రాథమిక హక్కు అని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం సనపల ప్రసాదరావు అన్నారు. బుధవారం స్థానిక మండల మహిళా మండలి సమాఖ్య కార్యాలయం వద్ద సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సంఘాలు ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు విధిగా ఓటు నమోదు చేసుకోవాలని, ఎన్నికల్లో వజ్రాయుధమైన ఓటును సమర్థులకే వేయాలని నినాదించారు.

ఓటే వజ్రాయుధం

వజ్రపుకొత్తూరు: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే వజ్రాయుధం అని తహసీల్దార్ సురేష్ అన్నారు. రెయ్యిపాడు పంచాయతీ పరిధి తేరపల్లిలో బుధవారం రెవెన్యూ అధికారులు ఓటర్ల చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు పునాది లాంటిదని అన్నారు. నైతిక విలువలతో కూడిన ఓటింగ్ వైపు పయణించాలని సూచించారు. యువ ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకొని సత్యానీయులైన నాయకులను చట్ట సభలను ఎంచుకోవాలని అన్నారు. ఉప తహసీల్దార్ వాయిలపల్లి గిరిరాజ్, వీఆర్వో రాజు, రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌వోలు ఉన్నారు.



ఇచ్ఛాపురం రూరల్: ర్యాలీ చేస్తున్న మహిళలు



వజ్రపుకొత్తూరు: అవగాహన కార్యక్రమంలో సిబ్బంది

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న పద్మజ

కాశీబుగ్గ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కోర్సులో శిక్షణ పొందిన 152 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో కాశీబుగ్గ సూర్యతేజ డిగ్రీ కళాశాలలో ఫిబ్రవరి ఐదు నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన ఆప్టిట్యూడ్ తరగతులకు 152 మంది శిక్షణ పొందారు. వీరంతా ఫైనల్ పరీక్షలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలు దానేటి పద్మజ చేతుల మీదుగా కోర్సు సర్టిఫికెట్లను విద్యార్థులకు అందించారు. ఏపీఎస్ఎస్‌డీసీ కో–ఆర్డినేటర్ ఎస్.వెంకటరమణ, ఉన్నతి ఫౌండేషన్ ఎన్‌జీవో తామాడ కిరణ్ ఉన్నారు.

కన్నుల పండువగా విగ్రహ ప్రతిష్ట

ఇచ్ఛాపురం రూరల్: సన్యాసిపుట్టుగలో బుధవారం కన్నుల పండువగా శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వస్వామి విగ్రహాలను వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా హరేరామ హరేకృష్ణ భజనా బృందాలతో వెంకటేశ్వరుని నామం మారుమ్రోగిపోయింది. కమనీయ దృశ్యాలను తిలకించేందుకు భక్తులు భారీగా తరలి వచ్చారు.